క్లుప్తంగా

ఘనంగా అయ్యంకి జయంతి



అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పాఠకులు

పాయకరావుపేట : గ్రంథాలయ పితామహుడు, స్వాతంత్ర్య సమర యోధుడిగా పేరు గాంచిన అయ్యంకి వెంకటరమణ జయంతి కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. పట్టణ శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో పలువురు పాఠకులు, విశ్రాంత ఉపాధ్యాయులు అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కనీస వేతనాలివ్వాలి



పంచాయతీ కార్మికులతో సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

అచ్యుతాపురం(అనకాపల్లి): పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌రావు కోరారు. అచ్యుతాపురంలో సోమవారం పంచాయతీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఉద్యోగులకు కల్పించిన సౌకర్యాలు పంచాయతీ కార్మికులకు ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డులు, పనిముట్లు, గ్లౌజులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.రాము, కొండమ్మ, నూకరాజు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



బీజేపీ సీనియర్ నేత ఇందల సన్యాసిరావును సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : బీజేపీ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఇందల సన్యాసిరావు కోరారు. పార్టీలో సీనియర్లను గౌరవించే కార్యక్రమంలో భాగంగా సీనియర్ నేత ఇందల సన్యాసిరావును సోమవారం అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో పార్టీ శ్రేణులు సత్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలో చురుకైన పాత్ర పోషించే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దొడ్డి సత్యనారాయణ, వేగి అప్పలనాయుడు, సాయిరాం పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మునగపాక : చూచుకొండ సమీపంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ ఆలీ తెలిపారు. చూచుకొండ దరి వడిశెల అప్పలరాజు మద్యం విక్రయిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అలీ తన సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో అప్పలరాజు మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని నుంచి 10 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్టు అలీ తెలిపారు.

చాకుతో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న సంతోష్ సాహు

రాంబిల్లి: నేవీ నిర్మాణ పనులు నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీ సంస్థలో పనిచేస్తున్న ఇద్దరు కార్మికుల మధ్య జరిగిన గొడవలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ దీనబంధు వివరాల ప్రకారం... ఒడిశాకు చెందిన సంతోష్ సాహు, జితేంద్ర కుమార్ ఎల్అండ్‌టీలో నేవీ నిర్మాణ పనులు చేస్తున్నారు. వీరిద్దరూ వాడనర్సాపురంలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. డబ్బు విషయమై వీరి మధ్య గొడవ జరగడంతో జితేంద్రకుమార్ కూరగాయలు కోసుకునే చాకుతో సంతోష్ సాహు పొట్టపై పొడిచాడు. అతడి కడుపు నుంచి పేగు బయటకు రావడంతో వెంటనే విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమం జగనన్న ఘనతే



లక్ష్మీపతిరాజుపేట గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



వమ్మవరంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గుడివాడ శివారు లక్ష్మీపతిరాజుపేట, గుడివాడ ఎస్సీ కాలనీలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నవీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చిన్నారులు, విద్యార్థులను కూడా ఎమ్మెల్యే పలకరించారు. కొందరికి ఇంటి స్కీమ్‌లు రాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో తగు చర్యలు తీసుకుని బిల్లులు అందించే ఏర్పాటు చేయాలని వెంట ఉన్న అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సదరం సర్టిఫికెట్లలో తప్పుల కారణంగా పింఛను రాని వారికి కూడా సదరం సరిచేసి పింఛను వచ్చేలా చేయాలని వెల్ఫేర్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో రామచంద్రమూర్తి, తహసీల్దార్ విజయ్‌కుమార్, గృహ నిర్మాణ ఏఈ ప్రసాద్, జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచ్ దూళి శ్రీనుబాబు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న, పలు గ్రామాల సర్పంచ్‌లు మల్లే లోవరాజు, కోశెట్టి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, బొట్టా రాంబాబు, చోడిపల్లి గోవిందు, అప్పలరాజు, మల్లికార్జున, కోరెడ్డి బాబి, మామిడి చంటి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ఎంతో ప్రయోజనకరం

ఎస్.రాయవరం : జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి ఒక్కరికి ప్రయోజనకరంగా మారిందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. వమ్మవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. 1749 ధ్రువీకరణ పత్రాలు అందజేయడం పట్ల సిబ్బందిని అభినందించారు. పెదగుమ్ములూరు గ్రామంలో కూడా సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే బాబూరావు అర్హులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఆ గ్రామంలో 1700 కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సిబ్బంది అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో రామచంద్రమూర్తి, జెడ్పీటీసీ కాకర దేవి, మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, వమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు, పెనుగొల్లు పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ దోసపాత్రుని హనుమంతరావు, మండల సచివాలయ కన్వీనర్ సందీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, గొంతిన సత్యనారాయణ, మణిరాజు, వెలగా శ్రీనివాసరావు, సీతారామరాజు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి



వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాయకరావుపేట : రైతులకు వ్యవసాయ పథకాలు వర్తించడం కోసం ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు అన్నారు. రైతులకు సున్నా వడ్డీ, పంట రుణాలు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, రైతు భరోసా, పండించిన పంటని ప్రభుత్వం కొనుగోలు, ఇన్‌పుట్ సబ్సిడీ అందాలంటే ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. సోమవారం ఏడీఏ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి ఈ పంట నమోదుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కీటక శాస్త్రవేత్త బి.నాగేంద్ర (బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం) వరిలో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో పాయకరావుపేట ఏవో ఆదినారాయణ, నక్కపల్లి ఏవో ఉమాప్రసాద్, కోటవురట్ల ఏవో సరోజిని, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల సర్వే



వాడ్రాపల్లిలో ఓటరు సర్వేలో అధికారులు, ప్రజా ప్రతినిధులు

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో ఓటరు సర్వే చురుగ్గా సాగుతుంది. ఈ నెల 21 నుంచి ఆగస్టు 21 వరకు ఓటరు జాబితాలో సవరణలు, మార్పులకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో తిరుగుతూ సర్వే పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. వాడ్రాపల్లిలో సంబంధిత సర్వే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

రాజయ్యపేటలోనే ఎఫ్ఎల్‌సీ, జెట్టీ నిర్మిస్తాం

మత్స్యకారులకు
ఎమ్మెల్యే బాబూరావు భరోసా



రాజయ్యపేట సభలో పాల్గొన్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గానికి జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిన ఫిష్ ల్యాండింగ్ సెంటరు, జెట్టీని రాజయ్యపేటలోనే నిర్మించి తీరుతామని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. సోమవారం రాజయ్యపేటలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి కుల ఆదాయ, నివాస, ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, పార్టీ నాయకులు ఎరిపల్లి నాగేశుల ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గానికి జగనన్న ప్రభుత్వం ఫిష్ ల్యాండింగ్ సెంటరు మంజూరు చేసిందని, దీన్ని దొండవాక, చందనాడలో నిర్మించడానికి ప్రయత్నిస్తున్నారని ఆ ప్రాంతాల్లోనే స్థల పరిశీలన చేశారని తెలిపారు. రాజయ్యపేటలో కూడా ప్రభుత్వ స్థలం ఉందని, ఇక్కడ 12 వేల జనాభా ఆరువేల మంది ఓటర్లు ఉన్నారని 300కి పైగా తెప్పలు ఉన్నాయని తెలిపారు. రాజయ్యపేటలోనే ఈ రెండు నిర్మించాలని కోరారు. ఈ విషయంపై ఈ సభలో ప్రకటన చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిష్ లాండింగ్ సెంటరుతో పాటు, జెట్టీని నియోజకవర్గానికి మంజూరు చేయాలని తానే ముఖ్యమంత్రి జగనన్నను కోరానన్నారు. నియోజకవర్గ మత్స్యకారుల ఉపాధిని ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ఇక్కడ ఈ రెండు పనులు మంజూరు చేసారన్నారు. రాజయ్యపేటలోనే నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఎటువంటి భయాందోళనలు చెందవద్దన్నారు. ఇక్కడ అవసరమైన స్థలం ఉందని జిల్లా కలెక్టర్‌కు, మత్స్యశాఖ అధికారులకు తెలియజేయడం జరిగిందన్నారు.

రాజయ్యపేటలో ఎఫ్ఎల్‌సి, జెట్టి నిర్మించి తీరుతామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేసిన ఘనత జగనన్నదేనన్నారు. వేటనిషేధ సమయంలో రూ.పదివేల నష్టపరిహారం, ప్రమాదవశాత్తూ వేటకి వెళ్లి మరణిస్తే ఏడు లక్షల ఆర్థిక సాయం డీజిల్‌పై సబ్సిడీ వంటి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు డీసీసీబీ ఛైర్మన్ పదవి, రాజ్యసభ సభ్యత్వం, మంత్రి పదవి సయితం ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాసులమ్మ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, ఎంపీడీవో సీతారామరాజు, తహసీల్దార్ అంబేడ్కర్, ఈవోపీఆర్డీ వెంకటనారాయణ, డీటీ నీరజ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో చెత్త తొలగింపు



అరబుపాలెంలో శ్మశానవాటికలో చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక : అరబుపాలెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. గ్రామానికి చెందిన శ్మశానవాటికలో పేరుకుపోయిన పిచ్చి మొక్కల తొలగింపుతో పాటు చెత్త తొలగింపు పనులను ఆయన సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామాన్ని ఆదర్శంగా తయారు చేస్తామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు.

లాలం భాస్కరరావుకు ఘన నివాళి



లాలం భాస్కరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

రాంబిల్లి: మాజీ ఎంపీపీ లాలం భాస్కరరావు పెద్ద కర్మ, సంతాప సభలను లాలంకోడూరు గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే రమణమూర్తి రాజు(కన్నబాబు), డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, లాలం కుటుంబసభ్యులు లాలం సత్యప్రసాద్, లాలం రమణమూర్తి, రాజాన రమేష్‌కుమార్, లాలం చందు, బ్రాండిక్స్ ఇండియన్ పార్టనర్ దొరైస్వామి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై లాలం భాస్కరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లాలం భాస్కరరావు సేవలను కొనియాడారు.

27న క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

అనకాపల్లిటౌన్: స్థానిక గౌరీగ్రంథాలయంలో ఈ నెల 27న క్యాన్సర్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ కార్యదర్శి కాంద్రేగుల వెంకటరమణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచ తల, మెడ క్యాన్సర్ దినోత్సవంలో భాగంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సదస్సుకు ముఖ్య అతిథిగా అగనంపూడి హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంతశెట్టి హాజరవుతారని పేర్కొన్నారు.

కోనేరు పార్కుకు మహర్దశ

- రూ.కోటితో అభివృద్ధికి కార్యాచరణ
- ఎంపీ నిధులు, వుడా సహకారంతో చర్యలు



పిచ్చిమొక్కలతో కశింకోటలోని కోనేరు పార్కు



పార్కులో దెబ్బతిన్న చప్టాపై సేద తీరుతున్న ప్రజలు

కశింకోట: కశింకోటలో సుమారు 20 వేల మంది జనాభా ఉన్నారు. అయితే వారు సేద తీరడానికి సరైన పార్కు లేదు. స్థానిక కోదండ సీతారామస్వామి ఆలయం పక్కన పురాతన కోనేరు పార్కు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. అయితే దాని ఆలనా పాలనా పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఈ పార్కుకు గతంలో సాయం సంధ్య వేళ సేద తీరేందుకు గ్రామస్తులు ఎక్కువగా వచ్చేవారు. దీని గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో తుప్పలు పెరిగి, పరిసరాలు అధ్వానంగా మారాయి. దీంతో జనాలు కూడా ఇక్కడికి సేదతీరేందుకు రావడం తగ్గింది.

గతంలో అరకొర పనులే..

ఈ పార్కును 2003లో అప్పటి ఎమ్మెల్యే దాడి వీరభద్రరావు సిఫార్స్‌తో వుడా నిధులతో విశాఖ వుడా పార్కు తరహాలో చిల్డ్రన్ పార్కుగా అభివృద్ధి చేసి, కోనేరులో బోటు షికారు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అప్పటి వుడా వైస్ ఛైర్మన్ దాసరి శ్రీనివాసులు పనులను ప్రారంభించారు. దీనిలో భాగంగా కోనేరు చుట్టూ శుభ్రపరచి పచ్చదనాన్ని పెంచేలా పూల మొక్కల నాటారు. తర్వాత దీన్ని పట్టించుకున్న పాపాన పోలేదు.

ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన సొంత నిధులు, ఉపాధి హామీ పథకంలో పూడికలు తీయించి, గట్లను చదును చేశారు. అంతకు మించి ఆయన ఊడా అభివృద్ధి చేయలేదు. పంచాయతీ కూడా నిధుల లేమితో ఆ వైపు దృష్టి పెట్టలేదు. దీంతో పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగి పార్కు అధ్వాన స్థితికి చేరింది. చెట్ల కూర్చునేందుకు నిర్మించిన సిమెంట్ చప్టాలు కూడా ధ్వంసమయ్యాయి. కొందరు దాతలు బెంచీలు సమకూర్చడంతో వాటిపైనే అడపా దడపా ప్రకృతి ప్రేమికులు కూర్చుని, ఆస్వాదిస్తున్నారు.

ఎంపీ సత్యవతి చొరవ

ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోనేరు పార్కు పరిస్థితి గురించి తెలుసుకున్న ఎంపీ సత్యవతి కరోనాకు ముందు వుడా నిధులతో అభివృద్ధికి సంకల్పించారు. కరోనా మహమ్మారి విజృంభణతో పనులు ముందుకు సాగలేదు. తాజాగా కోనేరు పార్కు అభివృద్ధిపై ఎంపీ దృష్టి పెట్టారు. దీనికి వుడాతోపాటు తన ఎంపీ నిధులు రూ.కోటి కేటాయించి, అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

ఈ నిధులతో పార్కు చుట్టూ రన్నింగ్ ట్రాక్, పచ్చదనం కోసం వివిధ రకాల మొక్కల పెంపకం, రాత్రుళ్లు వెలుగు కోసం సోలార్ దీపాలు, ప్రజలు కూర్చుని సేదతీరేలా బెంచీలు, కోనేటిలోకి నీరు చేరేలా మార్గాన్ని పునరుద్ధరించడం తదితర పనులు చేపట్టనున్నారు.

అన్ని వర్గాలకు న్యాయం చేయడమే సీఎం లక్ష్యం

ఎమ్మెల్యే కన్నబాబు రాజు



దిబ్బపాలెంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం (అనకాపల్లి): బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని దిబ్బపాలెంలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే ధృవీకరణ పత్రాలు అందజేసే కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ ఛైర్మన్ సుకుమారవర్మ చేతుల మీదుగా పలువురికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కో-ఆప్షన్ జెడ్పీ సభ్యుడు నర్మాల కుమార్, దిబ్బపాలెం సర్పంచ్ శాంతి కుమారి, పిన్నంరాజు వాసు, లాలం శ్రీను, అడిగర్ల శ్రీను, రాజాన విజయ్, విమలనాయుడు, దేముడు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ మేలు

ఎమ్మెల్యే కన్నబాబురాజు



షేకాళిపాలెంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

యలమంచిలి : జగనన్న సురక్షతో ప్రజలకు ఎంతో మేలు కలుగుతోందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. సోమవారం యలమంచిలి మండలంలో షేకాళీ పాలెం సచివాలయం పరిధిలో జంపపాలెం తురంగలపాలెం గ్రామాలకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం ఎమ్మెల్యే కన్నబాబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సుకుమారవర్మ, ఎంపీపీ గోవింద్‌తో కలిసి ఆయన పలువురికి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు, పట్టణ, వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంకా ఎవరైన లబ్ధిదారులు మిగిలిపోతే వారు ఇప్పుడు జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే సమస్యలు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మనరావు, తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఎంపీడీవో అప్పలనాయుడు, ఈవోపీఆర్డీ దీపిక, మండల పరిపాలనాధికారి ప్రసాదరావు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్యదొర, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, షేకాళీపాలెం, జంపపాలెం, తురంగలపాలెం వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గంటవానిపాలెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులైన వారికి పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఇప్పటికీ ప్రభుత్వ పథకాలకు నోచుకోలేని వారికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. మాజీ సర్పంచ్ అరిగా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కోన వెంకటలక్ష్మి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీ కర్రి నానిబాబు, పార్టీ నేతలు భాస్కరరావు, రమణ, డీఎల్‌డీవో మంజులావాణి, ఎంపీడీవో మన్మథరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో ఆర్థిక చేయూత

వైఎస్సార్ ఆసరా ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత కలుగుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గంటవానిపాలెం గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు దృష్టికి పలువురు మహిళలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకువచ్చారు. వైఎస్సార్ ఆసరా డబ్బులు తీసుకునేందుకు సుదూర ప్రాంతంలోని చూచుకొండ ఎస్‌బీఐకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వాహన సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నామని దగ్గరలో ఉన్న అనకాపల్లి ఎస్‌బీఐ ద్వారా లావాదేవీలు జరిగేలా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన



ఎస్.నర్సాపురం గ్రామంలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు, నాయకులు

పాయకరావుపేట : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అవసరమైన వారికి ధ్రువ పత్రాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసమే జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎ.సాంబశివరావు, మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ అన్నారు. మండలంలో గల ఎస్.నర్సాపురం గ్రామంలో ఎంపీడీవో సాంబశివరావు బృందం, ఈదటం గ్రామంలో మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ బృందం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్.నర్సాపురం గ్రామంలో నిర్వహించిన సురక్ష కార్యక్రమానికి 496 మంది వివిధ సంక్షేమ పథకాలకు, వివిధ ధ్రువ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో అర్హత గల వారందరికీ ఎంపీడీవో సాంబశివరావు, సర్పంచ్ మంచాల అనిత చేతుల మీదుగా ధ్రువ పత్రాలు అందించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లేల వెంకట్, కృష్ణార్జునరావు, డీటీ కె.నూకరాజు, ఈవోఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు. ఈదటం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 500 మంది దరఖాస్తులు చేసుకోగా అధికారులు విచారణ జరిపి తహసీల్దార్ కె.జయప్రకాష్, సర్పంచ్ పిర్ల వెంకటరమణ చేతుల మీదుగా ధ్రువ పత్రాలు అందించారు.

మణిపూర్ ఘటనల బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి



అచ్యుతాపురం హైస్కూల్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ

అచ్యుతాపురం(అనకాపల్లి): మణిపూర్‌లో మహిళలపై జరుగున్న అకృత్యాలకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అచ్యుతాపురం హైస్కూల్ వద్ద సోమవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రూపాదేవి మాట్లాడుతూ సుప్రీంకోర్టు స్పందించిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం, ప్రధాని కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారని ఆమె పేర్కొన్నారు. మణిపూర్ ఘటనలను రెండు తెగల మధ్య జరుగుతున్న వివాదాలుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.మాణిక్యం, ఆర్.లక్ష్మి, వి.శ్రీనివాసరావు, ఆర్.రాము, రమణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



యలమంచిలి: గుర్తు తెలియని వ్యక్తి మృతి(60) చెందిన ఘటన కొక్కిరాపల్లి హైవే సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై కె.సన్నిబాబు వివరాల ప్రకారం... యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి హైవే జంక్షన్‌లో కార్ షెడ్డు వద్ద వృద్ధుడు మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అతడి చేతిపై వి.శ్రీనివాసరావు అనే పచ్చబొట్టు వేసి ఉంది. మృతుడు చిరునామాతోపాటు మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. అతడి సంబంధికులు 9440796104 సంప్రదించాలని ఎస్సై కోరారు.

అరకొరగా గొర్రెలు, మేకల విక్రయాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సోమవారం గొర్రెలు, మేకల అమ్మకాలు తగ్గాయి. ప్రస్తుతం సీజన్ కాకపోవడంతో సంతకు వ్యాపారులు తక్కువగానే వీటిని తీసుకొచ్చారు. అందుకే తక్కువ సంఖ్యలో విక్రయానికి తీసుకువచ్చామని, అయినప్పటికీ ధర ఆశాజనకంగా లేకపోవడంతో విక్రయించగా మిగిలిన జీవాలను తిరిగి తీసుకుపోవాల్సి వస్తోందన్నారు. అయినప్పటికీ అమ్మకాలు పెద్దగా జరగలేదు. సాధారణంగా ఏటా సంక్రాంతి నుంచి వేసవి ముగిసే వరకు పండగలు, ఉత్సవాలు జిల్లాలో ఉండటంతో గొర్రెలు, మేకలకు గిరాకీ ఉంటుంది. ప్రస్తుతం వర్షా కాలం కావడం, పండగలు, ఉత్సవాలు వగైరా లేకపోవడంతో వీటికి డిమాండ్ బాగా తగ్గిందని వ్యాపారులు చెప్తున్నారు. రానున్న విజయదశమి వరకు పరిస్థితి ఇలానే ఉంటుందని రోలుగుంట మండలం జగ్గంపేటకు చెందిన మేకల వ్యాపారి నమ్మి నాని తెలిపారు.